సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 31 : మార్చి : 2025

గరిష్టం / కనిష్టం
39° / 23°

వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే

పాల్వంచరూరల్: వారం రోజులపాటు నిర్వహించే శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం అర్చకులు రక్షాబంధన, దీక్షారాధన, గోపూజ, మండపారాధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రుత్విక్‌కరణ, దీక్షా వస్త్రధారణ, అఖండ దీపారాధన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష కుసుమార్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం పూజలు నిర్వహించారు. ముత్యాల విశ్వనాథం, ఎస్‌కె.సాబిర్‌పాషా, కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, నందానాయక్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి



అమ్మవారి సేవలో న్యాయమూర్తి సాయిశ్రీ దంపతులు

పెద్దమ్మతల్లి అమ్మవారిని కొత్తగూడెం జిల్లా కోర్టు జడ్జి కె.సాయిశ్రీ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈఓ రజనీకుమారి, అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

తెలుగు సంప్రదాయాలు గొప్పవి

పాల్వంచ: తెలుగు సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సంబురాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బిక్కసాని సుధాకర్, మంతపురి రాజుగౌడ్, కొత్వాల శ్రీనివాసరావు, కె.సిద్ధార్థ్, కొండల రావు పాల్గొన్నారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో ప్రతి సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వ సెలవు రోజు కావడంతో రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండరని, గిరిజనులు గమనించి అర్జీలు సమర్పించేందుకు కార్యాలయానికి రావద్దని కోరారు.

ఇల్లెందువాసికి గౌరవ డాక్టరేట్



కిరణ్ కుమార్

ఇల్లెందు: పట్టణంలోని 24 ఏరియాకు చెందిన ఓరం కిరణ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా విభాగంలో సైంటిస్టుగా పని చేస్తున్న ఆయన కరీంనగర్ జిల్లా శనిగారం ప్రాజెక్టులో నీటిపారుదల, లభ్యత, ఉపయోగంపై జియోగ్రాఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం, రిమోట్ సెన్సింగ్ విధానాలపై పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

నేడు నర్సింగ్ హాస్టల్ భవనం ప్రారంభం



నర్సింగ్ హాస్టల్ భవనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో రూ.2.86 కోట్లతో నూతనంగా నిర్మించిన నర్సింగ్ హాస్టల్ భవనాన్ని ఈ నెల 31న సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రారంభించనున్నారు. ఈ నెల 27న ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల సోమవారానికి వాయిదా పడింది.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ఉత్సవాలకు అంకురార్పణ చేసిన అర్చకులు
- స్నపన తిరుమంజనం, మత్స్యంగ్రహణ పూజలు
- శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో 'విశ్వావసు' వేడుకలు
- ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం చేసిన పండితులు




బేడా మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు

నవమి ముచ్చట్లు
కౌంట్‌డౌన్ 7

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల తిరుకల్యాణ మహోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా అర్చకులు, పండితులు అంకురార్పణ చేశారు. తొలుత ఉదయం దేవస్థానంలో మూలమూర్తుల వద్ద ఉత్సవ అనుజ్ఞ తీసుకున్నారు. అనంతరం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులకు ఉత్సవాంగ స్నపనం నిర్వహించి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ జరిపి హారతి సమర్పించారు. ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్ రామాయణ పారాయణదారులకు, ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. పండితులు మూలమూర్తులకు, ఉత్సవ పెరుమాళ్లకు, నిత్యకల్యాణ మూర్తులకు, ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు దీక్షా కంకణధారణ చేశారు.





భక్తులకు ఉగాది పచ్చడిని అందజేస్తున్న అర్చకుడు, పంచాంగం చదువుతున్న స్థానాచార్యులు స్థలశాయి

రామయ్యకు శేషకల్ప వృక్ష వాహన సేవ

ఉగాది పర్వదినం సందర్భంగా స్వామివారికి భక్తులు సమర్పించిన స్వర్ణ పూత కల్పవృక్ష వాహనంపై తిరువీధి సేవ జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుదీర్చి తాత గుడి సెంటర్‌లోని గోవిందరాజ స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ సేకరించిన పుట్ట మట్టిని మరో వాహనంపై ఉంచి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలతో మత్స్యంగ్రహణం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


రాముడి ఆదాయం 08, వ్యయం 02

దేవస్థానంలో ఆదివారం విశ్వావసు తెలుగు సంవత్సరాది వేడుకలను ఘనంగా జరిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేపపూత పచ్చడి నివేదన చేసి భక్తులందరికీ పంచారు. సాయంత్రం బేడా మండపంలో ఆలయ పండితులు పంచాగ శ్రవణం చేశారు. ఈ ఏడాది రాముడి ఆదాయం 08, వ్యయం 02, రాజపూజ్యం 07, అవమానం 03 అని తెలిపారు. సీతమ్మవారి ఆదాయం 14, వ్యయం 02 అని, రాజపూజ్యం 06, అవమానం 06 అని పేర్కొన్నారు.

నేడు ఈదుల్ ఫితర్



కొత్తగూడెంటౌన్ రామవరంలో ముస్తాబైన జామియా మసీదు




కొత్తగూడెంటౌన్/కరకగూడెం: శాంతి, సహనం, పవిత్రత, క్రమశిక్షణకు ప్రతీకగా భావించే రంజాన్ వేడుకలు సోమవారం జరుపుకోనున్నారు. ఆదివారం షవ్వాల్ నెల వంక కన్పించడంతో గత 29 రోజులుగా ముస్లింలు ఆచరిస్తున్న ఉపవాసాలను విరమించారు. జిల్లావ్యాప్తంగా ఈదుల్ ఫితర్ జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదులను, ఈద్గాలను ముస్తాబు చేశారు. కొత్తగూడెం రైటర్‌బస్తీ సమీపంలోని బోడగుట్ట ఈద్గా, రామవరం 2 ఇంక్లైన్ లోని ఈద్గా, రుద్రంపూర్‌లోని ఈద్గాలతోపాటు పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాల్లో నేడు ప్రార్థనలు చేయనున్నారు. పేద, ధనిక తేడాలు లేకుండా అందరూ నూతన వస్త్రాలు ధరించి ఆనందోత్సాహాలతో పండుగను నిర్వహించుకోనున్నారు. మత పెద్దలు అందరితో ప్రత్యేక ప్రార్థనలు చేయించడంతోపాటు సందేశం ఇవ్వనున్నారు.

అందరూ దానం చేయాలి



పేదరికంలేని సమాజ నిర్మాణమే రంజాన్ ఆశయం. రంజాన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దాన గుణాలను అలవరుచుకుని పేదలకు అండగా నిలవాలి. నిరుపేదలు సంతోషంగా పండుగను జరుపుకున్నప్పుడే మాకు నిజమైన పండుగ.

–సయ్యద్ ఆరీఫ్ హుస్సేన్, కరకగూడెం



కొత్తగూడెంలో బోడగుట్ట వద్ద ఉన్న ఈద్గా

ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముస్లింలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారని, ప్రార్థనలు చేస్తారని పేర్కొన్నారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.

కుటుంబ సభ్యులతో మంత్రి ఉగాది సంబురాలు

తుమ్మలకు వేద పండితుల ఆశీర్వచనం



వేదాశీర్వచనం పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉగాది సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి సేవించారు. భద్రాచలం రామాలయ వేద పండితులు మంత్రి కుటుంబ సభ్యులకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వచ్చి మంత్రికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, పాడిపంటలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. దట్టమైన అటవీ ప్రాంతం పూసుకుంటలో నివసిస్తున్న కొండరెడ్ల పిల్లలకు మంత్రి కుటుంబ సభ్యులు స్కూల్ బ్యాగులు, స్వీట్ ప్యాకెట్‌లను అందజేశారు. తుమ్మల తనయుడు యుగంధర్, అతడి కుమారుడు ప్రయాగ్ చేతులమీదుగా చిన్నారులకు వితరణ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు పాల్గొన్నారు.

ఆర్‌యూవీ హెల్ప్ డెస్క్ ప్రారంభం



హెల్ప్ డెస్క్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం (ఆర్‌యూవీ) పథకానికి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు మండల పరిపాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తు గడువు వచ్చే నెల 5వ తేదీతో ముగియనుందని తెలిపారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేయూత

- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం
- స్వశక్తితో జీవనాధారం పెంపొందించుకోవాలి
- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్



లక్ష్మీపురంలో ఎగ్‌ట్రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యేలు

బూర్గంపాడు/అశ్వాపురం/భద్రాచలంటౌన్: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. శనివారం రాత్రి భద్రాచలం చేరుకున్న ఆయన ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీసీతారామ చంద్రస్వామివారి దర్శించుకున్నారు. అనంతరం భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో పర్యటించారు. భద్రాచలం పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి న్యూట్రిమిక్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. న్యూట్రిమిక్స్ పదార్థాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం దమ్మక్క జాయింట్ లయబిలిటీ గ్రూప్ మహిళలకు వ్యాపార విస్తరణ కోసం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో 60శాతం రాయితీతో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ నరసింహా ఎగ్‌ట్రే ఇండస్ట్రీని ఐటీడీఏ పీఓ రాహుల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులతో కలిసి ప్రారంభించారు. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామంలో సమ్మక్క–సారక్క మహిళా కందిపప్పు ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి, మహిళలతో మాట్లాడి ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ గిరిజన యువత, మహిళల జీవనోపాధికి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారమందిస్తామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలతో గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు.

పరిశ్రమలకు 60 శాతం రాయితీ

ట్రైకార్ ద్వారా పరిశ్రమలకు 60శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో మార్కెటింగ్ సరిగా లేక మూతపడిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను తిరిగి ప్రారంభించుకునేందుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. గిరిజన మహిళలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనాధారం పెంపొందించుకోవాలన్నారు. నాణ్యమైన కందిపప్పు తయారు చేసి సరసమైన ధరలకు విక్రయించాలన్నారు. ఐటీసీ, భారజల కర్మాగారం, భద్రాచలం దేవస్థానం అన్నదాన సత్రం వారిని సంప్రదించి పాలిష్ లేని కందిపప్పు సరఫరా చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో రూ.1,360 కోట్లతో సుమారు 5 లక్షల మంది యువతకు లబ్ధిచేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. జూన్ 2వ తేదీ నాటికి రాజీవ్ యువ వికాసం యూనిట్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ 25 చిన్న తరహా పరిశ్రమలను నిర్వహిస్తోందని తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహ ఎగ్ ట్రే యూనిట్‌కు రూ.150 లక్షలు కాగా అందులో ట్రైకార్ రూ.50లక్షల సబ్సిడీ అందిస్తుందన్నారు. రూ 15లక్షలు లబ్ధిదారుల కంట్రిబ్యూషన్ కాగా మిగతా రూ. 80 లక్షలు బ్యాంకు రుణమని తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో 35మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్‌రావు, మేనేజర్ లక్ష్మీప్రసాద్, ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) శ్యామ్‌కిరణ్, ఇతర అధికారులు డేవిడ్ రాజ్, భాస్కర్, సున్నం రాంబాబు, ప్రభాకర్ రావు, ఆదినారాయణ, అశోక్ కుమార్, వీరాస్వామి, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు చర్యలు..

ఫోన్ ఇన్‌లో విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్

సాక్షి ఫోన్ ఇన్



ఫోన్ ఇన్‌లో జవాబు ఇస్తున్న విద్యుత్ ఎస్‌ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ ఎస్‌ఈ జి.మహేందర్ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సాక్షి ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా, ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యుత్ వినియోగదారులు ఫోన్ చేసి వివరించిన సమస్యలను సావధానంగా విని, పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారమయ్యే సమస్యలపై ఆయా ప్రాంతాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ డీఈలు రంగస్వామి, నందయ్య, టెక్నికల్ డీఈ కృష్ణ, పాల్వంచ ఏడీఈ మధు, టెక్నికల్ ఏడీఈ రాంప్రసాద్, కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు పాల్గొన్నారు.

ప్రశ్న: మా ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య ఉంది. వేసవి కావడంతో ఇబ్బందిగా ఉంది. పరిష్కారం చూపగలరు?

–సమత్‌కుమార్, నాచారం మధురానగర్, దమ్మపేట మండలం

ఎస్‌ఈ: లో ఓల్టేజీ సమస్య ఎందుకు ఏర్పడిందో పరిశీలిస్తాం. ఆ ప్రాంతానికి సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం వినియోగానికి సరిపోయే విధంగా ఉందో లేదో చూసి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మా గ్రామంలో సుమారు 20 విద్యుత్ స్తంభాలు వేస్తే విద్యుత్ సమస్య తీరుతుంది. గతంలో కూడా దరఖాస్తు చేశాం.

–కె.రత్నకుమారి, శేషగిరినగర్, లక్ష్మీదేవిపల్లి మండలం

ఎస్‌ఈ: జిల్లాలో 263 నూతన ట్రాన్స్‌ఫార్మర్లకు అనుమతి లభించింది. జూగా పథకం ద్వారా మంజూరైన వీటిని అమర్చిన తర్వాత నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. జూన్ మాసంలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పాల్వంచలోని పలు ప్రాంతాలలో ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. వాటి వల్ల విద్యుతాఘాతానికి గురై ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. దయ చేసి సమస్యను పరిష్కరించండి?

–కె.నాగరాజు, టీచర్స్ కాలనీ, పాల్వంచ

ఎస్‌ఈ: విద్యుత్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నాం. నిర్మించాక ఇళ్లపై నుంచి హైటెన్షన్ లైన్లు వెళుతున్నాయని మా దృష్టికి తెస్తున్నారు. నిజంగా మొదటనే సమస్య ఉంటే పరిష్కారానికి చర్యలను తీసుకుంటాము. ఈసమస్య ఉన్న ప్రాంతాలను పొందు పరుస్తూ దరఖాస్తును సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో అందజేయగలరు.

ప్రశ్న: సోలార్ విద్యుత్ మీటర్ల మంజూరులో జాప్యం జరుగుతోంది.?

–దేవనపల్లి రమేష్, కొత్తగూడెం

ఎస్‌ఈ: దరఖాస్తు చేశాక సాధ్యమైనంత త్వరగా సోలార్ విద్యుత్ మీటర్లను మంజూరు చేస్తున్నాం. మా విద్యుత్ అధికారులను పంపించి మీ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మా ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉంది. ప్రజలు, పశువులకు ప్రాణహాని ఉంది.

–వెంకటాచలం, ప్రశాంతినగర్, లక్ష్మీదేవిపల్లి మండలం

ఎస్‌ఈ: తప్పకుండా సమస్యను పరిష్కరిస్తాం. ప్రజలు ఇలాంటి సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. విద్యుత్ సమస్యలు ఏవైనా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి వివరాలు చెబితే తక్షణ పరిష్కరిస్తాం.

ప్రశ్న: వ్యవసాయబోర్లు ఒక్కోసారి లోఓల్టేజీ సమస్య కారణంగా సరిగా పనిచేయడం లేదు. వేసవికాలంలో ఈ సమస్య ఎక్కువ అవుతుంది.

–ఎస్.ప్రసాదరావు, అశ్వారావుపేట

ఎస్‌ఈ: జిల్లావ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పరికరాలను అమరుస్తున్నాం. అతి త్వరలో మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ప్రశ్న: రామవరంలోని వివిధ ప్రాంతాల్లో కోతులు విద్యుత్ సర్వీస్ లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. వాటిని పట్టుకుని వేలాడటంతో తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.

–ఎం.శ్రీనివాసరావు, రామవరం, కొత్తగూడెం మున్సిపాలిటీ

ఎస్‌ఈ: సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. విద్యుత్ అంతరాయం జరిగితే మా అధికారులకు సమాచారం ఇవ్వండి. వారు వచ్చి లైన్లను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

ప్రశ్న: గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసినప్పటికీ మాకు విద్యుత్ బిల్లు వస్తోంది. దీనికి పరిష్కారం ఏమిటి?

–జి.మధుసూదన్‌రావు, చంద్రుగొండ

ఎస్‌ఈ: మీరు చేసిన దరఖాస్తులో ఏ కారణం చేత మంజూరు కాలేదో సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకుని, తిరిగి దరఖాస్తు చేయండి. తప్పకుండా సమస్య పరిష్కారం అవుతుంది.

క్లుప్తంగా

ముస్లింలకు పొంగులేటి రంజాన్ శుభాకాంక్షలు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలోని ముస్లింలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాసం ఉండి పవిత్రంగా జరుపుకునే పండుగ ఈద్ అని పేర్కొన్నారు. సహనం, త్యాగం, జాలి, దయ, సేవాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలంటూ దిశా నిర్దేశం చేసిన మాసం రంజాన్ అని తెలిపారు. పండుగను సంబురంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాగా, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ మరో ప్రకటన విడుదల చేశారు.

ఓయూలో ఆంక్షలను ఎత్తివేయాలి..

చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 13న ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ద్వారా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయొద్దంటూ జారీ చేసిన ఉత్వర్యులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పేరిట ఆదివారం ఒక లేఖను విడుదల చేసింది. 32వ రాజ్యాంగ చట్ట సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించిన సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూములను, రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధతను పట్టించుకోకుండా ప్రభుత్వం 400 ఎకరాలను అమ్మకానికి పెడుతోందని, విద్యార్థులు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధించారని జగన్ పేర్కొన్నారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశానికి 20న పరీక్ష

ఖమ్మంసహకారనగర్: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఏప్రిల్ 20న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా బీసీ గురుకుల విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారి సీహెచ్.రాంబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 24 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, అందులో 6వ తరగతికి బాలికలకు 249, బాలురకు 249 సీట్లు, 7వ తరగతిలో బాలికలకు 170, బాలురకు 177, 8వ తరగతిలో బాలికలకు 97, బాలురకు 124, 9వ తరగతిలో బాలికలకు 139, బాలురకు 184 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు రూ.150 రుసుముతో ఈనెల 31వ తేదీ(సోమవారం) లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగురాలిపై లైంగికదాడి

అశ్వారావుపేటరూరల్: ఇంట్లో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన 30 ఏళ్ల వయస్సుగల మానసిక దివ్యాంగురాలు తన తల్లితోపాటు కలిసి ఉంటోంది. కాగా, శనివారం తల్లి బయటకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న మానసిక దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన కొర్రి వెంకటేశ్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో వెంకటేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లవాగులో 13 పశువులు మృతి

పాల్వంచ: అంతుచిక్కని వ్యాధితో పశువులు మృతి చెందాయి. మున్సిపాలిటీ పరిధిలో పిల్లవాగు గ్రామంలో శని, ఆదివారాల్లో భూక్యా భద్రయ్య, ఊకె రాంబాబు, వర్సా వెంకటేశ్వర్లు, కుంజా భీమయ్య, ఊకె బుల్లెమ్మకు చెందిన 13 గేదెలు మృతి చెందాయి. అయితే ఈ అంతుచిక్కని వ్యాధితో చనితున్నాయని స్థానికులు వాపోతున్నారు. పశువుల మృతిపై స్థానిక వైద్యాధికారికి సమాచారం అందించడంతో చికిత్స నిర్వహించినప్పటికీ మృతి చెందినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పశువులు మొక్కజొన్న తోటలో మేశాయని, దాని వల్ల ఫుడ్ పాయిజన్ అయి మృత్యువాత పడ్డట్లు కూడా పలువురు తెలిపారు. పశువులు ఒక్కసారిగా చనిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటి వరకు సుమారు మొత్తం రూ.6లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనా.

కోడిపందేల స్థావరంపై దాడి

ములకలపల్లి: గుట్టు చప్పుడుకాకుండా కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండల కేంద్రానికి సమీపంలోని భగత్‌సింగ్‌నగర్ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న విశ్వసనీయ సమాచారం అందింది. దాడులు నిర్వహించి.. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.2 వేలు నగదు, నాలుగు బైక్‌లు, 10 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

మక్క రైతులకు భరోసా

- మార్క్‌ఫెడ్ ద్వారా పంట కొనుగోళ్లకు రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 55 కేంద్రాలకు పైగా ఏర్పాటు
- ఈ వారంలోనే పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోళ్లు



విక్రయానికి ఆరబెట్టిన మొక్కజొన్నలు

ఖమ్మం వ్యవసాయం: యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికందుతోంది. మక్కలకు ప్రైవేటు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించడం లేదు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలు క్వింటాకు రూ.2,225 ధర ప్రకటించగా, వ్యాపారులు రూ.2వేల నుంచి రూ.2,100 మించి చెల్లించడం లేదు. దీంతో పంట కొనుగోలుకు ప్రభుత్వం రంగంలోకి దిగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పంట సాగు చేసే ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో మక్కలు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం ఆదేశించగా.. రాష్ట్రంలో పంట సాగు ఆధారంగా 320 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ కొనుగోళ్లు మొదలుకానున్నాయి.

1.30లక్షలకు పైగా ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా మొక్కజొన్న విస్తారంగా సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 1,14,901 ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 16,938 ఎకరాల్లో పంట సాగైంది. ఎకరాకు 35 క్వింటాళ్ల చొప్పున రెండు జిల్లాల్లో దాదాపు 5.50 లక్షల క్వింటాళ్ల మక్కలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన 55కు పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 44, భద్రాద్రి జిల్లాలో 11 నుంచి 15 కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి.

పీఏసీఎస్, డీసీఎంఎస్‌కు బాధ్యతలు

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల ద్వారా మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా 38 కేంద్రాలు, డీసీఎంఎస్‌ల ద్వారా ఆరు కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా 11 నుంచి 15 కేంద్రాల ఏర్పాటు చేస్తారు.

వారం రోజుల్లో కొనుగోళ్లు..

పంట కోతలు, నూర్పిళ్లు ప్రారంభం కావడంతో ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. రవాణా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన మార్క్‌ఫెడ్.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇప్పటికే పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం దిశా నిర్దేశం చేసింది.

మక్కల కొనుగోళ్లకు సమగ్ర చర్యలు



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మక్కల కొనుగోళ్లకు సమగ్ర చర్యలు చేపట్టాం. పంట సాగు చేసిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్ సంస్థల ద్వారా పంట కొనుగోలుకు కార్యాచరణ చేశాం. నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 2,225 మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తాం. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. – సునీత, మేనేజర్ మార్క్‌ఫెడ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

ఎక్కడెక్కడ..

- ఖమ్మం జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా బ్రాహ్మణపల్లి, మోటమర్రి, కలకోట, లక్ష్మీపురం, రావినూతల, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, రామాపురం, పెద్దబీరవెల్లి, నారాయణపురం, బోనకల్, చిరునోముల, నాగులవంచ, పాతర్లపాడు, పొద్దుటూరు, పందిళ్లపల్లి, కొణిజర్ల, పెద్దమునగాల, పల్లిపాడు, రాజేశ్వరపురం, ముజ్జుగూడెం, మర్లపాడు, కందుకూరు, భరణిపాడు, మోటాపురం, జీళ్లచెరువు, ముదిగొండ, వనంవారి కిష్టాపురం, పెద్దమండవ, మేడేపల్లి, వీ.వీ.పాలెం, అల్లీపురం, తల్లాడ, మాధారం, కొండకొడిమ, సోమవరం, హస్నగుర్తి, కేశవాపురంలో కేంద్రాలు ఏర్పాటవుతాయి.
- డీసీఎంఎస్ ద్వారా రాయిగూడెం, అనాసాగరం, గువ్వలగూడెం, పెద్దగోపతి, తుమ్మలపల్లి, కొండాపురం, పమ్మి, లచ్చగూడెం గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.
- భద్రాద్రి జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా టేకులపల్లి, ఆళ్లపల్లి గుండాల, మర్కోడు, సెట్టిపల్లి, కొత్తగూడెం, చల్లసముద్రం, కొమరారం, ఇల్లెందు, దమ్మపేట, అశ్వారావుపేటలో కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. అవసరమైతే మరో నాలుగు నుంచి ఐదు కేంద్రాల ఏర్పాటుకు కూడా ఈ జిల్లాలో అవకాశం ఉంది.

నీటితొట్టిలోపడి అసస్మారక స్థితిలోకి చిన్నారి

వైద్యం అందించి కాపాడిన ఆర్‌ఎంపీ



బాలుడికి వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ

ములకలపల్లి: ప్రమాదవశాత్తూ నీటి తొట్టిలో పడిన చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లగా, ఆర్‌ఎంపీ అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. స్థానికుల కథనం మేరకు.. సత్తుపల్లికి చెందిన దుర్గ, వెంకటేశ్ దంపతుల రెండో కుమారుడు యువాన్ష్‌తో కలసి మండలంలోని రేగులకుంట గ్రామంలోని బంధువులు పోతురాజు ఇంటికి వచ్చారు. శనివారం సాయంత్రం ఇంట్లో చూడగా యువాన్ష్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా, పక్కనే ఉన్న నీటితొట్టితో తేలియాడుతూ కనిపించాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువాన్ష్‌ను హుటాహుటిన జగన్నాథపురంలోని ఆర్‌ఎంపీ ఎం.సుభానీ వద్దకు తీసుకువచ్చారు. ఆయన వైద్యం అందించి, పొట్టలోని నీటిని బయటకు తీశారు. సీపీఆర్ చేయగా బాలుడు స్పృహలోకి వచ్చి శ్వాస తీసుకున్నాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

గుడుంబా స్థావరాలపై దాడి



స్వాధీనం చేసుకున్న సారా డ్రమ్ముల వద్ద పోలీసులు

కరకగూడెం: మండలంలోని కొలూరు అటవీ ప్రాంతంలో కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ సిబ్బందితో కలిసి ఆదివారం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. ఈ సందర్భంగా సుమారు 3000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి



సతీశ్ మృతదేహం

గుండాల: భవనం పైనుంచి పడి డైలీవేజ్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని కాచనపల్లి గ్రామానికి చెందిన పూనెం సతీశ్ (30) మామకన్ను ఆశ్రమ పాఠశాలలో డైలీవేజ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం వంట పనులు ముగించుకుని తన ఇంటికి (హాస్టల్‌లోని క్వార్టర్ – ఫస్ట్ ఫ్లోర్) వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో బయటకు రాగా కాలు జారి పిట్టగోడ పైనుంచి కిందపడ్డాడు. గమనించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు 108 ద్వారా గుండాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఆళ్లపల్లి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు అప్పుడప్పుడూ మద్యం సేవిస్తాడని, కంటిచూపు సరిగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఉగాది రోజున సతీశ్ మృతి చెందడంతో కుంటుంబంలో, కాచనపల్లిలో తీవ్ర విషాదం అలుముకుంది. ఆస్పత్రిలో మృతదేహం వద్ద రాత్రి నుంచి తెల్లవారే వరకు హాస్టల్ సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పిరాయిగూడెంలో అగ్నిప్రమాదం



కాలిపోయిన ఇంటి ముందు బాధితుడు సొంది వెంకటి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామ పంచాయతీ పిరాయిగూడెంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించి నాలుగు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో రెండు ఇళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. బొర్రా పాండురాజు తన ఇంట్లో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తూ మరిచిపోయి బయటకు వెళ్లాడు. కాగా, గ్యాస్‌పై పెట్టిన గిన్నె పూర్తిగా మాడిపోయి మంటలు వ్యాపించి ఇంటిని చుట్టుముట్టాయి. మంటలు ఎగిసి పడి పక్కన ఉన్న వాగే లక్ష్మి, సొంది వెంకటి, సోడె నాగేశ్వరరావు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. సోమమ్మ, వాగే లక్ష్మయ్యకు చెందిన ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో మోటార్ల ద్వారా కూడా మంటలు ఆర్పే అవకాశం లేకుండాపోయింది. గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం అందించినప్పటికీ సమయానికి చేరుకోలేకపోయింది. ఇళ్లల్లోని ఏ వస్తువును కూడా బయటకు తీసే అవకాశం లేకపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. నగదు, బంగారం, బట్టలు, ఇంటి వస్తువులు, ధ్రువీకరణ పత్రాలు అంతా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షల ఆస్తినష్టం వాటిలినట్లు సమాచారం. బాధిత కుటుంబాలను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని నాయకులు తెల్లం హరికృష్ణ, సొందె మల్లూరు కోరారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. ఇల్లెందుకు చెందిన రాహుల్ తన కారులో మామిడిగూడెం నుంచి వస్తున్నాడు. అదే సమయంలో సీతానగరానికి చెందిన ఊకే సురేశ్ ఇల్లెందు నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తున్నాడు. కొమ్ముగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద ఎదురుపడిన రెండు వాహనాలు నేరుగా ఢీకొట్టి పక్కనే ఉన్న చెట్లకు తగిలి నిలిచిపోయాయి. చెట్లకు తాకడంతో పెను ప్రమాదం తప్పినట్లయిందని స్థానికులు తెలిపారు. వాహనాల్లో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు.

గ్యాస్ లీక్ అయి ఇద్దరికి గాయాలు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట వద్ద ఓ ఇంట్లో గ్యాస్ లీక్ అయి ఇద్దరికి ఆదివారం ఉదయం గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాజుపేటకు చెందిన వాంకుడోత్ స్వాతి ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో పైప్ లీకేజీ అయ్యి ఒక్కసారిగా గ్యాస్ పేలడంతో స్వాతితో పాటు వారి ఇంట్లో ఉన్న ఓ చిన్నారి గుగులోత్ అంజలికి గాయాలయ్యాయి. వారిని మణుగూరు ఆస్పత్రికి తరలించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లో భార్యతో గొడవ పడి మనస్తాపానికి గురైన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గుంజ చినరామారావు(28)తో యమునకు ఐదేళ్ల కిందట వివాహమైంది. మద్యానికి బానిసైన రామారావు తరచూ భార్యను కొడుతూ ఉండేవాడు. శనివారం రాత్రి మద్యం సేవించి భార్యను చితకబాదడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన భర్త ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు 100 పడకల ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి

పెనుబల్లి: సత్తుపల్లి మండలంలోని కొత్తలంకపల్లి శివారులో రోడ్డుపై ఆగి ఉన్న లారీ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరుకు చెందిన వన్నపురపు సీతారాం ప్రసాద్ (45) సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున విధులు పూర్తయిన సొంత ఊరికి వెళ్లడానికి, వైజాగ్ నుంచి ఖమ్మం వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో బస్సు కొత్తలంకపల్లి శివారుకు చేరుకోగా, జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ఎడమ పక్కన భాగం అంతా ధ్వంసం కాగా కండక్టర్ సీతారాంప్రసాద్‌తో పాటు ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 దారా పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉదయ్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా మరో ఇద్దరిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటుగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు.

ప్రజారంజక పాలన అందిస్తున్నాం

- ప్రజలకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎం భట్టికి హారతి ఇస్తున్న మహిళలు

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రజా పాలన ఫలాలు దక్కేలా జన రంజక పాలన అందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని కాచారం, కొత్త గోపవరం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పర్యటించారు. రైతులు, మహిళలు, చిన్నారులు ఇలా అన్ని వర్గాల వారినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. కాచారంలో విద్యుత్ సరఫరా ఎలా ఉంది.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడగగా.. గ్రామంలో 200 వరకు కుటుంబాలు ఉన్నాయని, గత ప్రభుత్వం కంటే ఇప్పుడు విద్యుత్ సరఫరా చాలా నాణ్యతగా వస్తోందని స్థానికులు చెప్పారు. రైతు భరోసాపై ఆరా తీయగా నాలుగైదు ఎకరాలకు వరకు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. గ్రామానికి రేషన్ దుకాణం, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరగా, భట్టి సానుకూలంగా స్పందించారు. అనంతరం కాచారం గ్రామ శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, నాయకులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, గంటా తిరుపతమ్మ, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, దేవరకొండ రాజీవ్‌గాంధీ, గుడేటి బాబురావు, పిల్లి బోస్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- దీపారాధన చేసి తాళం వేసి వెళ్లిన యజమానులు
- మంటలు వ్యాపించి ఫ్లాట్ పూర్తిగా దగ్ధం



ఫ్లాట్ నుంచి భారీగా వస్తున్న పొగలు



ప్రమాదంలో కాలిపోయిన ఇంటీరియర్

ఖమ్మంక్రైం: నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగి ఫ్లాట్ పూర్తిగా కాలిపోగా పైఅంతస్తు, పక్క ఫ్లాట్‌కు స్వల్పంగా నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతో భారీ ప్రాణ నష్టం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. బుర్హాన్‌పురంలోని రవీంద్రనాథ్ ఠాగూర్‌నగర్‌లో ఇటీవల పిన్ని టవర్స్ నిర్మించారు. వీటిలో కొన్ని ఫ్లాట్లను కొనుగోలు చేసినవారు నివాసం ఉంటున్నారు. 301 ఫ్లాట్ కొనుగోలు చేసిన సత్తిరెడ్డి ఇంకా గృహప్రవేశం చేయలేదు. కాగా, సత్తిరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం పండుగ కావటంతో దేవుడి గదిలో దీపం వెలిగించి, పూజ చేసి తాళం వేసి ప్రస్తుతం ఉన్న ఇంటికి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. వారు వెళ్లిన కొద్దిసేపటి తర్వాత కిటికీలో నుంచి పొగలు రావడాన్ని ఎదురు ఫ్లాట్ వారు గమనించి, కిటికీలో నుంచి చూశారు. వారు అరుస్తూ మంటలను ఆర్పేందుకు తమ ఇంట్లో నీళ్లను పోశారు. అయినా కూడా మంటలు అదుపులోకి రాలేదు. చివరకు వారు నివసిస్తున్న ఫ్లాట్‌కు సంబంధించిన అద్దాలు సైతం మంటల తాకిడికి పగిలిపోయాయి. దీంతో వారు ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకొని వాచ్‌మెన్‌కు సమాచారం అందించగా.. అతను వచ్చి చూడగా అప్పటికే మంటలు పైఅంతస్తులోకి వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా వారు వచ్చారు.

తప్పిన ప్రాణనష్టం..

ఘటనా స్థలానికి చేరుకొన్న ఫైర్ సిబ్బంది అపార్ట్‌మెంట్‌లో ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అందరినీ కిందకు వెళ్లాలని ఆదేశించారు. మెట్ల మార్గం ద్వారా పైకి చేరుకొని మంటలను ఆర్పుకుంటూ ఆరు కుటుంబాల వారిని క్షేమంగా కిందకు తీసుకొచ్చారు. ఒక ఫైరింజన్ సరిపోకపోవడంతో మరో ఫైరింజన్‌ను రప్పించారు. మహబూబాద్ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనాథ్ రెస్క్యూ సిబ్బందిని పైకి తీసుకెళ్లి.. ఆయనే స్వయంగా మంటలను ఆర్పివేశారు. రెండు గంటలపాటు శ్రమించి, మంటలను అదుపులోకి తీసుకురావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనతో అపార్ట్‌మెంట్‌వాసులు భయాందోళనకు గురయ్యారు. గంటలోనే అంతా జరిగిపోయిందని అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. ఇదిలా ఉండగా తాము దీపం వెలిగించలేదని షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదం సంభవించి ఉండవచ్చని సత్తిరెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి అజయ్ సందర్శించారు. ఖమ్మం ఫైర్ అధికారి బాలకృష్ణ, సిబ్బంది భాస్కర్‌రావు, కిరణ్‌కుమార్, రాంబాబు, నరసింహారావు, విజయ్ కుమార్, టూటౌన్ పోలీసులు మంటలన ఆర్పడంతో సఫలీకృతమయ్యారు. కాగా, సుమారు రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

మొక్కజొన్న కంకులు తిని రైతు మృతి



జర్పుల కృష్ణ (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన ఓ రైతు మొక్కజొన్న కంకులు తిని మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వినోభానగర్ గ్రామానికి చెందిన జర్పుల కృష్ణ (30) ఐదు ఎకరాల విస్తీర్ణంలో మగ (మేల్), ఆడ (ఫిమేల్) మొక్కజొన్న సాగుచేశాడు. మొక్కజొన్న చేను వద్ద కాపలాగా ఉంటున్న ఆయన వారం రోజుల నుంచి మొక్కజొన్న కంకులు తింటున్నాడు. ఈ క్రమంలో కృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్.. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మొక్కజొన్న కంకులు తినడం కారణంగానే చనిపోయాడని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు చెప్పడంతో మొక్కజొన్న విత్తన కంపెనీ బాధ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడారు.

డివైడర్‌కు ఆటో ఢీ.. ఒకరు మృతి



తిరుమలాచారి (ఫైల్)

పాల్వంచరూరల్: డివైడర్‌ను ఆటో ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్‌కు చెందిన తిరుమలాచారి (33), ఆగస్టీనా అంటోనిరాజు, అంబాల శ్రీకాంత్ భద్రాచలంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో పాల్వంచ మండలం జగన్నాథపురం శివారులోని బీసీఎం జాతీయ రహదారిపై డివైడర్‌ను ఆటో ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న ముగ్గురుకి గాయలు కాగా 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన తిరుమలాచారిని వరంగల్ ఎంజీఎంకు తరలించగా మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మామిడితోటకు తప్పిన అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు గ్రామ పంచాయతీ చెక్‌పోస్టు వద్ద మామిడితోటలోకి వ్యాపిస్తున్న మంటలను ఇల్లెందు ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఆర్పివేశారు. తునికి మోడెం కొట్టే పనుల్లో భాగంగా కొంతమంది సమీపంలోని అడవికి నిప్పు పెట్టినట్లుగా స్థానికులు చెబుతున్నారు. మంటలు విస్తరించి చెక్‌పోస్టు రొంపేడు గ్రామం వరకు విస్తరించడంతో అప్రమత్తమైన గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటికే మంటలు మామిడితోట సమీపంలోకి చేరడంతో ఫైర్‌సిబ్బంది సకాలంలో మంటలను ఆర్పివేశారు. దీంతో పెను అగ్ని ప్రమాదం తప్పినట్లైందని గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు

అశ్వాపురం: మండల కేంద్రంలో నలుగురిపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై ఆదివారం అశ్వాపురం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రావణ్‌కుమార్‌కు అశ్వాపురానికి చెందిన స్రవంతికి వివాహమైంది. రెండేళ్లుగా దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో స్రవంతి మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీలో పుట్టింట్లో ఉంటోంది. శనివారం రాత్రి శ్రావణ్‌కుమార్ స్రవంతి ఇంటికి వచ్చి ఆమెతో గొడవపడ్డాడు. అడ్డు వచ్చిన మామ నరసింహులు, అత్త వనజాక్షి, ఇంటి పక్క గాదె శేషగిరిపై కత్తితో దాడి చేశాడు. గాయాలైన నలుగురిని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి శ్రావణ్‌కుమార్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.